





అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..

ప్రజల గొంతుకగా..

- నేడు కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆంధ్రజ్యోతి కార్యక్రమం
- హాజరుకానున్న ఎమ్మెల్యే, అధికారులు

పుట్టపర్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆంధ్రజ్యోతి 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' అనే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తమ సమస్యలను ప్రజలే నేరుగా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి వీలుగా కార్యక్రమం చేపట్టింది. మౌలిక నదుపాయాలకు నోచక ప్రజలు ఏళ్లుగా అధికారులు, నేతలకు విన్నవించుకుంటూనే ఉన్నారు. వారి చుట్టూ తిగిరి విసిగి వేసారిపోయినవారు కోకొల్లలు. ఈ నేపథ్యంలో సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి ప్రజలు తీసుకెళ్లే అవకాశం ఆంధ్రజ్యోతి కల్పిస్తోంది. అందులో భాగంగా మంగళవారం కొత్తచెరువులోని బీసీ కాలనీలో గల సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో కార్యక్రమం జరగనుంది. ఉదయం 9 గంటలకు సమావేశం మొదలవుతుంది. కార్యక్రమానికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎంపీడీఓ నటరాజ్, డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులు, సర్పంచ్ రాధ, మండల వ్యవసాయాధికారి నటరాజ్, పంచాయతీ ఈఓ శ్రీనివాసరెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్‌నాయక్, ఉపాధి ఏపీఓ నాగిరెడ్డి, ఐకేపీ ఏపీఎం నారాయణ, మండలస్థాయి అధికారులు, కూటమి నేతలు పాల్గొంటారు. ప్రజలు తరలివచ్చి, సమస్యలపై ఫిర్యాదు చేసుకోవచ్చు.

సమస్యలివీ..

బీసీ కాలనీతోపాటు కుమ్మర కాలనీ, వేణుగోపాల్ నగర్ ఇరుకు దారుల్లో డ్రైనేజీ సౌకర్యంలేక రోడ్లపైనే మురుగునీరు పారుతూ దుర్వాసన వెదజల్లుతోంది. నడవడానికి కూడా వీలులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులతో గడుపుతున్నారు. కాలనీల్లో చాలా వీధులకు సిమెంటు రోడ్లు లేవు. మట్టి రోడ్లు, ఆపై మురుగునీటి ప్రవాహంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. జనం జ్వరాల బారినపడుతున్నారు. విద్యుత్ లైన్లు లేక కట్టెల స్తంభాలపై వైర్లు ఏర్పాటు చేసుకున్నారు. చాలా ఇళ్లకు తాగునీటి సౌకర్యం లేదు. వీధి దీపాలు వెలగడం లేదు. లింకురోడ్లు లేక ఇళ్లకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలను స్థానికులు.. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని ఆంధ్రజ్యోతి కల్పిస్తోంది.

మళ్లీ డిటెన్షన్..?




తరగతి గదిలో విద్యార్థినులు

- విద్యార్థులు పాసైతేనే పైచదువులకు..
- 5, 8 తరగతుల్లో అమలుకు కేంద్రం యోచన
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై సందిగ్ధత
- ఉపాధ్యాయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు

ధర్మవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో డిటెన్షన్ విధానం మళ్లీ తెరపైకి వచ్చింది. పాఠశాల స్థాయిలో 5, 8 తరగతుల విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులైతేనే పైతరగతులకు పంపించే డిటెన్షన్ పాలసీని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిటెన్షన్ అమలుతోనే విద్యార్థుల్లో సామర్థ్యాలు పెరిగి పైచదువుల్లో రాణిస్తారని కేంద్రం ప్రభుత్వం యోచిస్తోంది. ఆ మేరకు ఉచిత నిర్బంధ విద్యా చట్టానికి సవరణ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. మారిన నిబంధనలను పిల్లల ఉచిత, నిర్బంధ విద్య (సవరణ) నియమాలు-2024 అని పిలుస్తారు. తాజా సవరణ నిబంధనల ప్రకారం 5, 8 తరగతుల్లో విద్యా సంవత్సరం చివరిలో నిర్వహించే రెగ్యులర్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని పిల్లలను అదే తరగతిలో డిటైన్ చేస్తారు. అంటే పైతరగతికి పంపించరన్న మాట. ఫలితాల ప్రకటన తేదీ నుంచి రెండు నెలల వ్యవధిలో విద్యార్థులకు మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైన వారిని మాత్రమే పైతరగతులకు పంపుతారు. లేదంటే అదే తరగతి మళ్లీ చదవాల్సిందే. ఈ విధానం ప్రైవేటు పాఠశాలలకు లబ్ధి చేకూరుస్తుందనీ, ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులు ఇబ్బందులు పడతారని కొందరు ఉపాధ్యాయులు భావిస్తున్నాయి. డిటెన్షన్ సరైన విధానమేనని మరికొందరు పేర్కొంటున్నారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులను కూడా చైతన్యపరచాల్సి ఉంటుంది. వెనుకబడిన విద్యార్థుల జాబితాలు తయారు చేసుకుని, వ్యక్తిగతంగా వారిని మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. పరీక్ష, పునఃపరిశీలన అనేది పిల్లలు సమగ్రాభివృద్ధి సాధనకు సామర్థ్య ఆధారిత పరీక్షలుగానే ఉండాలి కానీ కంఠస్థం, విధానపరమైన నైపుణ్యాలపై ఆధారపడి ఉండకూడదని తాజా సవరణ ఉత్తర్వుల్లో కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు, సైనిక స్కూల్ తదితర పాఠశాలల్లో అమలులోకి రానుంది. ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో అమలు చేయాలా, వద్దా.. అన్న దానిపై ఏపీ ప్రభుత్వానిదే తుది నిర్ణయం. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలుచేసే అవకాశం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

1970 వరకు అమలులో..

ఉమ్మడి రాష్ట్రంలో 1970 వరకు ప్రాథమిక విద్యలో అక్షరాస్యత శాతం కూడా చాలా తక్కువగా ఉండేది. విద్యార్థులు బడులకు దూరంగా ఉండేవారు. అప్పటి వరకు డిటెన్షన్ విధానం అమలులో ఉండేది. అప్పటి ప్రభుత్వం అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు మధ్యలో బడి మానేసే పిల్లల సంఖ్య (డ్రాపౌట్)ను తగ్గించేందుకు బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో నాన్ డిటెన్షన్ (పరీక్షలతో సంబంధం లేకుండా పైతరగతికి పంపడం) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంలో 7, 10 తరగతులను మినహాయించి అన్నింటిలో నాన్ డిటెన్షన్ విధానాన్ని 1971లో ప్రవేశపెట్టారు.

పరీక్షలు ఒక్కటే ముఖ్యంకాదు...

ఏడు తరువాత పైతరగతికి వెళ్లాలంటే కామన్ ఎగ్జామ్స్ విధానాన్ని 1971 నుంచే అమలు చేశారు. గణితం, సైన్స్, ఆంగ్లంలో విద్యార్థుల సామర్థ్యాలు పెరిగేలా చూడాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. పాఠ్యాంశాల బోధనకు తగినట్టు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పాస్ గ్యారెంటీ పేరుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆకర్షించే ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలో పరిస్థితులు విషమిస్తున్నాయన్న ఉద్దేశంతో ఏడో తరగతిలో కామన్ పరీక్షల విధానానికి 2008లో విద్యాశాఖ స్వస్తి చెప్పింది. కొందరు నాన్ డిటెన్షన్ విధానం వల్ల పిల్లలు ఏటా పై తరగతికి వెళ్తుండడంతో డ్రాపౌట్స్ శాతం క్రమంగా తగ్గింది. బడుగు, బలహీనవర్గాల పిల్లలు పాఠశాలలకు రావడం క్రమేణా పెరిగింది. నాన్ డిటెన్షన్ విధానంతో బాలికల్లో సైతం అక్షరాస్యత శాతం పెరిగిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. డిటెన్షన్ విధానాన్ని అమలు చేస్తే విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో బాధ్యత పెరుగుతుందనీ, ఉపాధ్యాయులు శ్రద్ధతో బోధిస్తారనే వాదనా వినిపిస్తోంది. ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయనీ, ఉన్నత విద్యలోనూ రాణిస్తారని అంటున్నారు. భిన్న వాదనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

నాన్ డిటెన్షన్ విధానాన్ని కొనసాగించాలి



డిటెన్షన్ విధానంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాస్ కాలేక డ్రాపౌట్‌గా మిగిలే అవకాశం ఉంటుంది. విద్యకు పేద చిన్నారులను దూరం చేస్తుంది. కేంద్రం ప్రవేశపెట్టాలని చూస్తున్న డిటెన్షన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనుమతించవద్దు.

- శెట్టిపి జయచంద్రారెడ్డి, యూటీఎఫ్

డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం..



ప్రభుత్వం తీసుకొస్తున్న డిటెన్షన్ విధానం వల్ల డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం ఉంది. 5, 8 తరగతుల పిల్లలు ఇంకా పరిజ్ఞానం పెంపొందించుకునే దశలో ఉంటారు. వారికి పబ్లిక్ పరీక్షలు నిర్వహించడం ద్వారా ఎక్కువ శాతం ఫెయిలయ్యే అవకాశాలుంటాయి. సబ్జెక్టు టీచర్లు, పాఠశాలలో మౌలిక వసతులు ఉంటే కొద్దివరకు ఈ విధానం సత్ఫలితాలు ఇచ్చే అవకాశం ఉంటుంది.

- కోనంకి చంద్రశేఖర్, ఎస్టీయూ

డిటెన్షన్ విధానం ఉండాల్సిందే..



ప్రస్తుత పరిస్థితుల్లో డిటెన్షన్ విధానం ఉండాలి. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. విద్యార్థుల్లో విద్యపై ఆసక్తి, బోధన నైపుణ్యాలు పెంపొందించాలంటే డిటెన్షన్ విధానం అవసరం. గతంలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉండటం వల్ల దానిని తగ్గించాలనే ఉద్దేశంతో నాన్ డిటెన్షన్ విధానం ప్రవేశపెట్టారు. ప్రస్తుతం విద్య గురించి తల్లిదండ్రులందరిలో అవగాహన పెరిగింది. నైపుణ్య విద్య కావాలని కోరుకుంటున్నారు.

-బీకే ముత్యాలప్ప, ఏపీటీఎఫ్

కలెక్టరేట్‌లో కలకలం

- కిరోసిన్ పోసుకుని ఒకరు..
- పురుగు మందు డబ్బాతో వృద్ధ దంపతుల రాక..
- అడ్డుకున్న పోలీసులు


ఒంటిపై కిరోసిన్ పోసుకున్న సోముశేఖర్‌ను వారిస్తున్న పోలీసులు

పుట్టపర్తిటౌన్, జనవరి27(ఆంధ్రజ్యోతి): సమస్యపై అధికారులు పదేపదే ఫిర్యాదు చేస్తున్నా.. పరిష్కరించకపోవడంతో విసిగిపోయిన బాధితులు కలెక్టరేట్‌లో ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. ఓ యువకుడు ఒంటిపై కిరోసిన్ పోసుకుని, నిప్పంటించుకునేందుకు యత్నించాడు. పోలీసులు అడ్డుకుని, స్టేషన్‌కు తరలించారు. వృద్ధ దంపతులు పురుగు మందు డబ్బాతో కలెక్టరేట్‌కు వచ్చారు. తనిఖీ చేస్తున్న పోలీసులు గుర్తించి, అడ్డుకున్నారు. ఈ పరిణామాలతో స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలకలం రేగింది.

ఒంటిపై కిరోసిన్ పోసుకుని..

పరిగి మండలం గౌరవహళ్లి గ్రామానికి చెందిన సోముశేఖర్.. తల్లి గంగమ్మను వెంటబెట్టుకుని కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చాడు. కార్యాలయం బయటే ఒంటిపై కిరోసిన్ పోసుకున్నాడు. పోలీసులు అప్రమత్తమై సోముశేఖర్‌ను వారించి, అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి పరిస్థితి వివరించారు. బాధితులు మాట్లాడుతూ.. తమకు తెలియకుండా తమ భూమిని గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా రికార్డుల్లో ఎక్కించుకున్నారని, ఇందుకు స్థానిక రెవెన్యూ అధికారులు సహకరించారని కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ క్షేత్రస్థాయిలో విచారణ చేసి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

పురుగు మందు డబ్బాతో..



ధర్మవరం మండలం నడిమిగడ్డపల్లికి చెందిన పెద్దన్న, ఆయన భార్య తమ భూమిని బంధువులు కబ్జా చేశారని ఫిర్యాదు చే యడానికి కలెక్టరేట్‌కు వచ్చారు. కార్యాలయం బయట తనిఖీ చేస్తున్న పోలీసులకు వృద్ధ దంపతుల సంచిలో పురుగు మందు డబ్బా దొరికింది. తమకు న్యాయం చేయకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి కలెక్టరేట్‌కు వచ్చామని వారు తెలిపారు. కలెక్టర్ వద్దకు పోలీసులు వారిని తీసుకెళ్లారు. వారి సమస్య విన్న కలెక్టర్ వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

196 అర్జీలు..

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 196 అర్జీలు వచ్చాయి. వాటిని కలెక్టర్ అందుకున్నారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డీపీఓలో..

పుట్టపర్తిరూరల్: జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 67 అర్జీలు అందాయి. వాటిని ఎస్పీ రత్న స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

లైన్ క్లియర్..!

- పురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్
- 3న ప్రక్రియ
- టీడీపీ వశమైనట్లేనా?



హిందూపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు మార్గం సుగమమైంది. ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసింది. ఆరు నెలలుగా ఊరిస్తున్న మున్సిపల్ చైర్మన్ పీఠం తెలుగుదేశం పార్టీ వశం కానుంది. దీంతో టీడీపీ కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ తరఫున చైర్మన్ అభ్యర్థిగా డీఈ రమేష్ పేరు ఇప్పటికే ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఖరారు చేశారు. ఇక ఎన్నిక లాంఛనమని టీడీపీ వర్గాలు అంటున్నాయి.

హిందూపురం మున్సిపల్ ఎన్నికలు 2021లో నిర్వహించారు. మున్సిపాలిటీలో 38 వార్డులు ఉండగా.. ఇందులో అప్పుడు వైసీపీ 29 స్థానాలను కైవసం చేసుకుంది. తెలుగుదేశం పార్టీ 6, బీజేపీ, ఎంఐఎం, స్వతంత్ర్య అభ్యర్థి ఒక్కో స్థానంలో గెలిచారు. అప్పట్లో 19వ వార్డు నుంచి గెలుపొందిన వైసీపీ కౌన్సిలర్ ఇంద్రజను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో..

వైసీపీ తరఫున చైర్‌పర్సన్‌గా ఇంద్రజ మూడున్నరేళ్లు కొనసాగారు. ఆమె అప్పట్లో వైసీపీ ఇన్‌చార్జి మహ్మద్ ఇక్బాల్ వర్గం కావడంతో చైర్మన్ పదవికి ఇబ్బందిలేకుండా సాగింది. వైసీపీ ఇన్‌చార్జి నుంచి ఆయనను తొలగించి, దీపికకు బాధ్యతలు అప్పగించడంతో మున్సిపల్ చైర్మన్ వర్సెస్ వైసీపీ ఇన్‌చార్జిగా పోరు సాగింది. దీంతో చైర్‌పర్సన్.. ఇన్‌చార్జి వర్గానికి దూరంగా ఉంటూ వచ్చారు. ఈ తరుణంలో గతేడాది నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎంఐఎం, వైసీపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతేడాది ఆగస్టులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతోపాటు, ఎనిమిది మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆ మరుసటిరోజే ఇంద్రజ తన చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది.

వైస్ చైర్మన్‌కు అవకాశం

గతేడాది ఆగస్టులో చైర్‌పర్సన్ తన పదవికి రాజీనామా చేయంతో అప్పటి నుంచి ఆ స్థానం ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో మూడు నెలలు దాటిపోతున్నా చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ రాకపోవడంతో నవంబరులో ప్రస్తుతం రెండో వైస్ చైర్మన్‌గా ఉన్న బలరాంరెడ్డిని ఎంపిక చేసి ఎన్నికల సంఘం తాత్కాలిక చైర్మన్‌గా నియమించింది. దీంతో ఆయన మున్సిపల్ చైర్మన్‌గా నవంబరు ఆఖరి వారంలో ప్రమాణ స్వీకారం చేశారు. నవంబరు 20న మున్సిపల్ తాత్కాలిక చైర్మన్‌గా బలరాంరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు.

నోటిఫికేషన్ జారీ

రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ చైర్మన్ ఎన్నికలకు సంబంధించి సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో హిందూపురం చైర్మన్ ఎన్నిక కూడా ఉంది. చైర్మన్ ఎన్నికకు సంబంధించి ఈనెల 30న కౌన్సిలర్లకు సమావేశం ఏర్పాటు చేస్తామని నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. వచ్చేనెల 3న 11 గంటలకు హిందూపురం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. అనివార్య కారణాల వల్ల 3న వాయిదా పడితే మరుసటి రోజు అనగా ఫిబ్రవరి 4న చైర్మన్ ఎన్నికకు అవకాశం ఇస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

లాంఛనమేనా?

2021లో వైసీపీ వశమైన హిందూపురం మున్సిపాలిటీ టీడీపీ వశం కావడం లాంఛనమేనని తెలుస్తోంది. మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు 20మంది కౌన్సిలర్లు అవసరం. తెలుగుదేశం పార్టీకి 22 మంది కౌన్సిలర్లతోపాటు ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు కూడా ఉండటంతో సంఖ్యాబలం 24కు చేరింది. ఈ నేపథ్యంలో చైర్మన్ సీటు తెలుగుదేశం పార్టీ వశమైనట్లేనన్న చర్చ సాగుతోంది. చైర్‌పర్సన్‌పదవికి రాజీనామా చేసిన ఇంద్రజ వాల్మీకి సామాజికవర్గానికి చెందిన వారు. తెలుగుదేశం పార్టీ కూడా అదే సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని ఎంపిక చేయాలని నిర్ణయించింది. దీంతో 6వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా కొనసాగుతున్న డీఈ రమేష్ చైర్మన్ కావడానికి లైన్ క్లియర్ అయినట్లు టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. రెండు నెలల క్రితమే మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందని భావించి టీడీపీ తరఫున గెలుపొందిన ఆరుగురు సభ్యులతోపాటు వైసీపీ నుంచి పార్టీలో చేరిన వారితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. అప్పట్లో చైర్మన్ ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో పదిరోజులపాటు ఇతర ప్రాంతాల్లో విహారయాత్రకు వెళ్లిన సభ్యులు తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో మరోసారి తెలుగుదేశం పార్టీ తరఫున సభ్యులు విహార కేంద్రానికి వెళ్లే అవసరం ఉంది. ఏది ఏమైనా ఆరు నెలలుగా ఎదురుచూస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ఎట్టకేలకు వచ్చేనెల 3న నిర్వహించనున్నారు.

సాహితీ స్రష్ట.. మాడుగుల 7
వరించి వచ్చిన పద్మశ్రీ
కడవకల్లు గ్రామస్థుల హర్షం
అనర్హుల్లో ఆందోళన..!
పింఛన్ల వెరిఫికేషన్ ప్రారంభించిన ప్రభుత్వం

క్రైం కార్నర్

వేధింపులకు మహిళ బలి


మీనాక్షి (ఫైల్)

యల్లనూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శింగవరం గ్రామంలో అత్తింటి వేధింపులు తాళలేక మీనాక్షి (32) ఆదివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసగౌడ్ తెలిపారు. శింగవరం గ్రామానికి చెందిన మీనాక్షి ఇదే గ్రామానికి చెందిన జయప్రకాష్‌ను 14 ఏళ్ల కిందట ప్రేమించి వివాహం చేసుకుంది. ఇటీవల కొద్దిరోజుల నుంచి కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. అనుమానంతోపాటు కట్నం తేవాలని భర్త, ఆడబిడ్డ భర్త శివశంకర్ తరచూ మీనాక్షిని వేధించేవారు. వీటిని తాళలేక జీవితంపై విరక్తి చెందిన ఆమె ఇంటిలో అందరూ నిద్రపోతున్న సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతురాలి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పొలాల్లో దొంగలు

- ఆదివారం రాత్రి వరుసగా కేబుల్‌వైర్‌ల చోరీ


జగదీష్ తోటలో కేబుల్‌వైరు కట్ చేసుకొని వెళ్లిన దృశ్యం

యాడికి, జనవరి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు గ్రామం వద్ద ఆదివారం రాత్రి పది మంది రైతుల బోరు బావులకు సంబంధించిన కేబుల్‌వైరు ఎత్తుకెళ్లారు. రాయలచెరువుకు చెందిన రైతులు జగదీష్, శ్రీనివాసులు, వాసుదేవ తెలిపిన మేరకు.. రాత్రి 7గంటల సమయంలో తోటల వద్దకు వెళ్లి నీటిపారకం చూసుకొని వచ్చామన్నారు. తోటల వద్దకు సోమవారం ఉదయం వెళ్లి చూస్తే బోరుబావుల వద్ద కేబుల్‌వైరు కట్ చేసుకొని వెళ్లినట్లు గమనించామని తెలిపారు. జగదీశ్‌కు చెందిన మూడుబోరుబావుల కేబుల్‌వైరు, శ్రీనివాసులుకు చెందిన ఒక బోరుబావి కేబుల్‌వైరు, వాసుదేవకు చెందిన ఒక బోరుబావి కేబుల్‌వైరును దుండగులు కత్తిరించుకు వెళ్లినట్లు తెలిపారు. సమీపంలోని మరికొందరు రైతుల బోరుబావుల కేబుల్‌వైర్లను కట్ చేసుకొని వెళ్లారని తెలిపారు. పోలీసులు కేబుల్‌వైర్ చోరీలను అరికట్టకపోతే రైతులు బోరుబావుల కిందపంటలు సాగుచేయడం కష్టమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీ వర్గీయుడి దౌర్జన్యం

- ఆశా వర్కర్‌పై కట్టెతో దాడి
- చేయి విరగడంతో ఆస్పత్రిపాలు
- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు


తీవ్రంగా గాయపడిన లక్ష్మీదేవి

ధర్మవరంరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చురామి గ్రామంలో వైసీపీ వర్గీయుడు పెద్ద పక్కీరప్ప దౌర్జన్యానికి దిగాడు. సోమవారం ఆశావర్కర్ లక్ష్మీదేవిపై కట్టెతో దాడి చేయడంతో ఆమె చేయి విరిగి, తీవ్రంగా గాయపడింది. లక్ష్మీదేవి తన గొర్రెల దొడ్డిలో పని చేసుకుంటుండగా పెద్ద పక్కీరప్ప అక్కడికి వెళ్లి దుర్భాషలాడాడు. ఎందుకు తిడుతున్నావని అడగ్గా.. కట్టెతో దాడిచేశాడు. తలపై కట్టెతో కొడుతుండడంతో ఆమె చేయి అడ్డం పెట్టింది. దీంతో చేయి విరిగింది. అడ్డువచ్చిన లక్ష్మీదేవి కుమార్తె, 3 నెలల బాలింత అయిన శశిపై దాడి చేశాడు. గాయపడిన లక్ష్మీదేవి, ఆమె కుమార్తె శశిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్ద పక్కీరప్ప గతంలో కూడా గొర్రెల మేపు విషయంలో తమపై దాడికి వచ్చాడనీ, అప్పట్నుంచి తాము కనిపిస్తే బూతులు తిడుతూ దాడికి యత్నిస్తుండేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. పెద్దపక్కీరప్ప తరచూ గ్రామస్థులపై దాడి చేస్తున్నాడనీ, మహిళలు అని కూడా చూడకుండా ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నాడనీ, తనకు వైసీపీ నాయకుల అండ ఉందంటూ భయభ్రాంతులకు లోను చేస్తున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

గోరంట్ల ఎస్ఐ బాబు సస్పెన్షన్

గోరంట్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్సింపల్లిలో దళితుడిపై దాడి వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎస్ఐ బాబును సస్పెండ్ చేస్తూ ఎస్పీ రత్న సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలికను వెంట తీసుకెళ్లాడని దళితుడు ఆంజనేయులును ఈనెల 21న నార్సింపల్లిలో విద్యుత్ స్తంభానికి కట్టేసి, దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు ఆంజనేయులుపై పోక్సో కేసు కట్టారు. ఈ నేపథ్యంలో మూడురోజుల క్రితం ఎస్పీ నార్సింపల్లికి చెందిన రెండు కుటుంబాల వారిని విచారించారు. ఘటనను సీరియస్‌గా తీసుకోవడంతో బాలిక బంధువులు ఏడుగురిని అరెస్టు చేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు వెంకటశివారెడ్డిని అరెస్టు చేశారు. ఆంజనేయులుపై దాడి అనంతరం పోలీసు స్టేషన్‌లో విచారణ సమయంలోనూ, కేసు నమోదు విషయంలో ఎస్ఐ బాబు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎస్పీ విచారణలో తేలింది. దీంతో ఎస్ఐపై చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

రైల్వే డివిజన్‌కు మూడు అవార్డులు

గుంతకల్లు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో నిబద్ధత చూపిన ముగ్గురు రైల్వే ఉద్యోగులకు ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డుల లభించాయి. జోనల్ కేంద్రంలోని రైల్ నిలయంలో వివిధ రైల్వే డివిజన్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలను ప్రకటించారు. గుంతకల్లు, హైదరాబాద్ డివిజన్లలో ముగ్గురు ఉద్యోగులు చెప్పున, విజయవాడ డివిజన్‌లో ఇద్దరికి, సికింద్రాబాద్ డివిజన్‌లో ఒకరికి ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు. విధుల్లో అప్రమత్తత, ఆపత్కాలంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం, తదితర అంశాలు ప్రాతిపదికగా ఈ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్టు రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ వెల్లడించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కల్లు గీత ఉపకులాలకు కేటాయించిన 9 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లోగానీ, హైబ్రిడ్ పద్ధతిలోగానీ వచ్చేనెల 5వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 6న దరఖాస్తుల పరిశీలన, 7న లాటరీ ద్వారా మద్యం దుకాణాలు కేటాయిస్తామన్నారు. ఆయా కల్లుగీత ఉప కులాలకు చెందిన అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సాహితీ స్రష్ట.. మాడుగుల

వరించి వచ్చిన పద్మశ్రీ పురస్కారం

కడవకల్లులో గ్రామస్థుల హర్షం


మాజీ ప్రధాని పీవీ నరసింహారావుతో మాడుగుల నాగఫణిశర్మ

పుట్లూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అపారమైన పాండిత్యంతో అవధానాలలో మేటిగా నిలుస్తూ ప్రశంసలు పొందుతున్నారు మండలానికి చెందిన మాడుగుల నాగఫణి శర్మ. ఈయన వందల కొద్ది అష్టావధానాలు చేసి, శతావధాని, సహస్రఫణి, బృహత్ ద్వి సహస్రావధానిగా కీర్తి గడించారు. ఈయన స్వగ్రామం అనంతపురం జిల్లా పుట్లూరు మండలంలోని కడవకల్లు గ్రామం. 1959 జూన్ 8న నాగభూషణశర్మ, సుశీలమ్మ దంపతులకు రెండో సంతానంగా మాడుగుల నాగఫణి శర్మ జన్మించారు. ఈయన పదో తరగతి వరకు కడవకల్లు, పుట్లూరు, లేపాక్షి, కడపజిల్లా ప్రొద్దుటూరులో విద్యాభ్యాసం సాగింది. తర్వాత సాహిత్యశిరోమణి పట్టా కోసం తిరుపతి వెళ్లారు. అక్కడ కపిలతీర్థం వీధుల్లో ప్రశాంత వాతావరణంలో ఉన్న ప్రాచ్య కళాశాల ఆయనలోని అక్షరదీప్తిని జాగృతం చేసింది. అక్కడ ఉపన్యాసం చేయడం మొదలు పెట్టారు. అనంతరం మైసూరు విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ, ఢిల్లీలో రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ నుంచి శిక్షాశాస్త్రి, తిరుపతి రాష్ట్రీయ విద్యాపీఠం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 1985-1990 మధ్యకాలంలో కడప రామకృష్ణ జూనియర్ కళాశాలలో సంస్కృత ఉపన్యాసకుడిగా పనిచేశారు. 1990నుంచి 1992మధ్య కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో ధర్మప్రచార పరిషత్తు అడిషనల్ కార్యదర్శిగా కూడా నాగఫణిశర్మ పనిచేశారు. ఈయన ప్రతిభను గుర్తించిన కేంద్రప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. దీంతో ఆయన స్వగ్రామమైన కడవకల్లులో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పాండిత్యానికి ప్రశంసలు

మాడుగుల నాగఫణిశర్మ తన సాహిత్య ప్రతిభతో మాజీ రాష్ట్రపతి శంకర్‌దయాల్‌శర్మ, మాజీ ప్రధాన మంత్రులు పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయి సమక్షంలో అవధానం నిర్వహించి ప్రశంసలు అందుకున్నాడు. ఈయన ప్రతిభకు అప్పట్లోనే శతావధానిసామ్రాట్, శతావధాన చూడామణి, కళాసాహిత్య కల్పద్రుమ వంటి ఎన్నో బిరుదులు వచ్చాయి. పలుచోట్ల పలువురు అభిమానులు కనకాభిషేకాలు, స్వర్ణశారదా ముద్రిక, ముత్యాలజల్లు, ఆందోళికాభోగం, స్వర్ణకంకణం, గండపెండేరం వంటివి చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయనకు జ్యోతిష్యశాస్త్రంలో కూడా మంచి ప్రావీణ్యం ఉండటం గమనార్హం.


మాడుగుల నాగఫణిశర్మ



చాలా ఆనందంగా ఉంది

మా గ్రామంలో పుట్టి పెరిగిన మాడుగుల నాగఫణిశర్మకు పద్మశ్రీ పురస్కారం దక్కడం చాలా సంతోషం కలిగిస్తోంది. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అవార్డు ఇవ్వడం మా గ్రామానికే గర్వకారణం. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి. ఎంచుకున్న రంగాలలో రాణించేందుకు ప్రయత్నించాలి.

- రామాంజనేయులు, కడవకల్లు

గ్రామానికి గుర్తింపు

మాడుగుల నాగఫణిశర్మకు పద్మశ్రీ అవార్డును ప్రకటించడంతో మా గ్రామానికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభించింది. నాగఫణి శర్మ అద్భుతంగా ఉపన్యాసాలు ఇచ్చేవారని మా నాన్న చెప్పేవారు. ఆయన ప్రతిభ గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడం హర్షించదగ్గ విషయం. అంత గొప్ప పండితుడు మా ఊర్లో పుట్టడం గర్వంగా ఉంది.

- నాగేశ్వర్‌రెడ్డి, కడవకల్లు



జాగ్రత్తగా పని చేయండి

- హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం
- ఎమ్మెల్యే పరిటాల సునీత


బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సునీత

చెన్నేకొత్తపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. ప్రతి విద్యార్థిని తమ సొంతబిడ్డలా చూసుకోవాల్సిన బాధ్యత వార్డెన్‌లదేనన్నారు. చెన్నేకొత్తపల్లిలోని బీసీ బాలుర, ఎస్సీబాలికల హాస్టళ్లను సోమవారం సాయంత్రం ఆమె తనిఖీ చేశారు. బీసీ హాస్టల్‌లో గణతంత్ర దినోత్సవం రోజున మధ్యాహ్నం భోజనం లేక విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడిన సంఘటనపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో భోజనం బాగుందా ? ఏవైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగారు. మరుగుదొడ్లు సక్రమంగా లేవని, తాగునీటి సమస్య ఉందని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం హాస్టల్‌లోని ప్రతి గదితో పాటు భోజన నాణ్యతను పరిశీలించారు. తర్వాత ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించి కొద్దిసేపు విద్యార్థులతో ముచ్చటించారు. ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ హాస్టల్ భవనం దెబ్బ తిందని, మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని రూ.40లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. ఈ విషయాన్ని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామని, మరోసారి కూడా తీసుకెళ్తామని తెలిపారు. హాస్టల్‌లో తాత్కాలిక మరమతుల కోసం కలెక్టర్ రూ.10లక్షలు మంజూరు చేస్తామని తెలిపారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సౌకర్యాల కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందన్నారు. ఎస్సీ బాలికల హాస్టల్‌కు రూ.33.80లక్షలు, ఎస్సీ బాలుర హాస్టల్‌కు రూ.32.40 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్ఐ నరసింహమూర్తి, వార్డెన్‌లు నరసింహమూర్తి, శ్యామల, టీడీపీ మండల కన్వీనర్‌ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, నాయకులు మాదెం సూర్యనారాయణరెడ్డి, అంకేఅమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పగలే గొలుసు చోరీకి యత్నం

- ప్రతిఘటించిన మహిళ


చోరీ విషయాన్ని వివరిస్తున్న భార్గవి

ఓబుళదేవరచెరువు, జనవరి27(ఆంధ్రజ్యోతి): స్థానిక కదిరి-హిందూపురం ప్రధాన రహదారిలో రెయిన్ బో పాఠశాల వద్ద భారత్ కూల్‌డ్రింక్స్ దుకాణంలో సోమవారం పగలే గొలుసు చోరీకి దుండగులు యత్నించారు. బాధితురాలు ప్రతిఘటించడంతో దొరికినకాడికి దోచుకెళ్లారు. మండల కేంద్రానికి చెందిన భార్గవి రెయిన్‌బో పాఠశాల వద్ద కూల్‌డ్రింక్స్ చిల్లర దుకాణం నడుపుతోంది. ఆమె భర్త వెంకటరామిరెడ్డి పనినిమిత్తం పొరుగూరు వెళ్లాడు. ఆమె ఒంటరిగా ఉన్న విషయానిన గుర్తించిన దుండగులు ఇద్దరు బైక్‌పై అక్కడికెళ్లారు. ఒకరు దుకాణంలోకి వెళ్లి రూ.20 ఇచ్చి అర లీటరు వాటర్ బాటిల్ కొనుగోలు చేశాడు. మిగిలిన రూ.పది చిల్లర ఇచ్చేందుకు ఆమె డబ్బు పెట్టెను తీస్తుండగా ఆమె మెడలోని మంగళసూత్రంచైన్‌ను లాగాడు. భార్గవి రెండు చేతులతో చైన్‌ను గట్టిగా పట్టుకుని కేకలు వేసింది. చైన్ తెగిపోవడంతో అందులో కొంతభాగాన్ని దుండగుడు తీసుకుని, అప్పటికే ఆన్‌చేసి ఉన్న ద్విచక్రవాహనం ఎక్కి ఉడాయించారు. అంతటితో ఆగని బాధితురాలు.. చైన్‌స్నాచర్‌పై కత్తి విసిరింది. అయినా వారు ఉడాయించారు. చుట్టుపక్కలవారు 100కి ఫోన్ చేయడంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. చైన్ స్నాచర్స్ కోసం వెతగ్గా.. వారు దొరకలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ విచారిస్తున్నారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయండి: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీల్లో పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం ఆయన పన్ను వసూళ్లకు సంబంధించి పలు విషయాలను వెల్లడించారు. గడువులోపు పన్నులు వసూలు చేయకపోతే ఇబ్బందులు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. పంచాయతీల్లో పన్ను వసూళ్లకు సంబంధించి గడువు లోపు టార్గెట్‌లు పూర్తి చేయాలని హెచ్చరిస్తున్నా, కొంత మంది సిబ్బందిలో ఏమాత్రం చలనం లేదన్నారు. ఇప్పటికే పన్ను వసూళ్లలో వెనుకబడిన వారికి సంబంధించిన జాబితా సిద్ధం చేశామని, అందుకు అనుగుణంగా తరచూ సమీక్షిస్తామన్నారు. గడువులోపు పంచాయతీలకు రావాల్సిన పన్నులు, నాన్‌ట్యాక్సులకు సంబంధించి వంద శాతం రాబట్టాల్సిందేనని పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల డిగ్రీ పరీక్ష ఫలితాలను విడుదలచేసినట్లు సోమవారం ప్రిన్సిపల్ పద్మశ్రీ తెలిపారు. తన కార్యాలయంలో వైస్ ప్రిన్సిపాల్ శశాంకమౌళితో కలిసి ఆమె ఫలితాలను విడుదలచేసి మాట్లాడారు. డిసెంబరులో డిగ్రీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. బీఏ 62, బీకామ్ 57, బీఎస్సీ 60, బీబీఏ 48 శాతం చొప్పున విద్యార్థులు పాస్ అయ్యారని వివరించారు. మొదటి సెమిస్టర్‌తోపాటు తృతీయ, ఐదో సెమిస్టర్ రివాల్యుయేషన్ కోసం ఫిబ్రవరి 4లోపు దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఈసీ రామకృష్ణ, అధికారులు చలపతి, శ్రీనివాసులు, నాగార్జున, విభాగాధిపతులు పాల్గొన్నారు.

అనర్హుల్లో ఆందోళన..!

- పింఛన్ల వెరిఫికేషన్ ప్రారంభించిన ప్రభుత్వం
- అనంతపురం, గుంతకల్లు ఆస్పత్రులలో దివ్యాంగుల పరిశీలన


ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పెన్షన్ వెరిఫికేషన్‌కు హాజరైన దివ్యాంగులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల వెరిఫికేషన్‌తో అనర్హుల్లో ఆందోళన మొదలైంది. గత ప్రభుత్వంలో ఎడాపెడా సర్టిఫికెట్లు పొంది పలువురు అనర్హులు పింఛన్ పొందుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఏరివేత ప్రారంభించింది. జిల్లాలో ఇప్పటికే మంచానికే పరిమితమై రూ.15వేలు పింఛన్ పొందుతున్న వారి ఇంటింటి వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఇలాంటివారిని 2499మందిని గుర్తించగా, 1178మంది వెరిఫికేషన్‌ను పూర్తి చేశారు. మిగిలిన వారివి పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దివ్యాంగుల పింఛన్లను కూడా పునఃపరిశీలన చేయాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రూ.ఆరు వేలు పింఛన్ పొందుతున్న 45,820మంది పింఛన్‌దారుల సర్టిఫికెట్లు, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించనున్నారు. ఇందుకు జిల్లా కేంద్రం అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులలో డీఆర్‌డీఏ-వెలుగు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సోమవారం రెండు ప్రాంతాల్లో సుమారు వెయ్యి మందికిపైగా పింఛన్‌దారులు వెరిఫికేషన్‌కు హాజరుకావడంతో ఆయా ఆసుపత్రుల ప్రాంగణాలు కిటకిటలాడాయి. ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన 12మంది డాక్టర్ల బృందాలు, డీఆర్‌డీఏ-వెలుగు అధికారులు పింఛన్‌దారుల పునఃపరిశీలన చేపట్టారు. ఇందులో 8 మంది బుద్ధిమాంద్యం డాక్టర్లు, ఇద్దరు ఈఎన్‌టీ డాక్టర్లు, ఇద్దరు సైక్రియాటిస్టులను ప్రభుత్వం నియమించింది. ప్రతి సోమ, మంగళ బుధవారాల్లో పునఃపరిశీలన చేయనున్నారు. అనంతరం డాక్టర్ల బృందాలు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. 12మంది డాక్టర్లను ఆరు టీంలుగా ఏర్పాటు చేశారు. ప్రతి డాక్టర్ వారంలో మూడు రోజుల పాటు రోజుకు కనీసం 50 పింఛన్‌దారుల సర్టిఫికెట్లు, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించనున్నారు.


ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్‌దారులను పరిశీలిస్తున్న డాక్టర్ల బృందం

జిల్లాలో వెరిఫికేషన్ చేయాల్సిన పింఛన్లు 45,820

జిల్లాలో 45,820మంది పింఛన్లు వెరిఫికేషన్ చేయనున్నారు. ఇందులో ఆర్థోపెడిక్‌కు సంబంధించి 24,700మంది, అంధులు 5,124 మంది, చెవిటి, మూగ 6,705మంది, బుద్ధిమాంద్యం 5,102మంది, మానసిక రోగులు 1036మంది, ఇతర దివ్యాంగులు 3,153మంది ఉన్నారు.

1,178మందికి వెరిఫికేషన్ పూర్తి

జిల్లాలో మంచానికే పరిమితమైన పింఛన్‌దారుల వెరిఫికేషన్ ప్రారంభించారు. మొత్తం 2499మందిని గుర్తించగా ఇప్పటి వరకు 1178మంది వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పరిశీలన చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ పాలనలో 6టీంలు పింఛన్‌పరిశీలన ప్రారంభించారు. ఇందులో ఆర్థోపెడిక్ డాక్టర్, జనరల్ సర్జన్ డాక్టర్‌లతో ఆశావర్కర్లు, వెలుగు సిబ్బంది పాల్గొంటున్నారు. ఆరువారాల్లో పూర్తి చేయాలని ఇప్పటికే డాక్టర్లకు ప్రభుత్వం సూచించింది. ఇళ్లవద్దకే వెళ్లి ప్రత్యేకంగా నియమించిన బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.

పురస్కారం సిగ్గుపడేలా..!



పురస్కార ధ్రువపత్రం.. ఇన్‌సెట్‌లో వార్డెన్ నారాయణ స్వామి

చెన్నేకొత్తపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను పస్తులుంచి.. సస్పెండైన చెన్నేకొత్తపల్లి బీసీ బాలుర వసతి గృహం వార్డెన్ నారాయణ స్వామి.. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాలలో 'ఉత్తమ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పురస్కారం అందుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో గణతంత్ర పురస్కారాలను అందుకు అతితక్కువ మంది వార్డెన్‌లలో నారాయణస్వామి ఒకరు. ఆదివారం ఉదయం పురస్కారం అందుకున్న ఆయన.. సాయంత్రానికి సస్పెండ్ అయ్యారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందలేదని తెలిసి హాస్టల్‌కు వెళ్లిన ఆర్డీఓకు స్థానికులు పలు ఫిర్యాదులు చేశారు. విధి నిర్వహణలో వార్డెన్ నిర్లక్ష్యంగా ఉంటారని, మద్యం సేవించి వస్తారని వివరించారు. పురస్కారాల జాబితాలో చేర్చే సమయంలో కనీస వివరాలు సేకరించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఎవరికిపడితే వారికి..

ప్రజలకు మెరుగైన సేవలు అందించేవారు, నిజాయితీగల అ ధికారులను గౌరవించేందుకు గణతంత్ర వేడుకలలో ప్ర భుత్వం పురస్కారాలను అందజేస్తుంది. కానీ పురస్కారాల ఎంపిక ప్రక్రియ ప్రహసనంగా మారుతోంది. నీతి, నిజాయితీతో సంబంధం లేదు. విధి నిర్వహణలో చిత్తశుద్ధి అవసరం లేదు. సిఫార్సు ఉంటే చాలు.. జాబితాలో చేరిపోవచ్చు. ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాల్సిన జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వచ్చిన జాబితాను గుడ్డిగా ఆమోదిస్తున్నారు. పద్ధతిగా పనిచేసే అధికారులు, ఉద్యోగులను వేళ్లమీద లెక్కబెట్టవచ్చు. కానీ గణతంత్ర వేడుకలలో పురస్కారాలు అందుకునేవారు వందల్లో ఉంటున్నారు. నిజాయితీగా పనిచేసి పురస్కారం దక్కించుకున్నవారు. తమతోఎటుఉ అసమర్థులు, అవినీతిపరులు కూడా పురస్కారం అందుకోవడాన్ని జీర్ణించుకోలేకున్నారు. ఇలా ఎవరికిపడితే వారికి పురస్కారాలు అందించే ఆలోచన ఉంటే.. తమలాంటివారికి ఇవ్వకపోతేనే మంచిదని అంటున్నారు. 'మరకల' సరసన నిలబడేందుకు అసౌకర్యంగా ఉందని అంటున్నారు.

టమోటా కిలో రూ.17

అనంతపురం రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 17తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 12, కనిష్ఠ ధర రూ. 8 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.15వేలు

అనంతపురం రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 15వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠం గా రూ. 9వేలు, సరాసరి రూ. 10వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపా రు. మార్కెట్‌కు మొత్తం 12 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

న్యూస్ బాక్స్

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్

ధర్మవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీచెన్న కేశవపురంలో యశోద కాన్సెప్ట్ పాఠశాల 17వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ శంకర నారాయణ, డైరెక్టర్లు పృథ్వీరాజ్, రవీంద్ర ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ... ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం గత ఏడాది పదో తరగతిలో 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో, ప్రిన్సిపల్ అనూప్, కుటుంబ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏఓ లోకేశ్వర్ రెడ్డికి అవార్డు



అవార్డు అందుకుంటున్న ఏఓ లోకేశ్వర్ రెడ్డి

నంబులపూలకుంట, జనవరి 27 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ఏఓ లోకేశ్వర్‌రెడ్డి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం కలెక్టర్ టీఎస్ చేతన్ చేతుల మీదుగా ఆయన ఆ అవార్డు అందుకున్నారు. సోమవారం ఆయన్ను ఏఓ కార్యాలయ సిబ్బంది, మండ లాధికారులు అభినందించారు.

బ్లూమూన్ కళాశాల విద్యార్థికి..



లిఖితాబాయికి అవార్డు అందజేస్తున్న అనంత కలెక్టర్

కదిరిఅర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన స్థానిక బ్లూమూన్ ఇంటర్ కళాశాల విద్యార్థిని లిఖితబాయి క్రీడాసాఫల్య పురస్కారానికి ఎంపికైంది. ఆదివారం అనంతపురంలో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆమెకు ఆ అవార్డు అందజేశారు. సోమ వారం బ్లూమూన్ కళాశాలలో లిఖితబాయిని కళాశాల చైర్మన్ శివశంకర్, అధ్యాపకులు అభినందించారు.

వైసీపీ నుంచి బీజేపీలో చేరిక

ధర్మవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక 10వ వార్డులో వైసీపీకి చెందిన క్రిష్టాపురం జమీర్, ఆయన కుమారుడు షాహన్‌షా, అనుచరులు బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్ సమక్షంలో వారు ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, గొట్లూరు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు అధికారుల గైర్హాజరు

ఓబుళదేవరచెరువు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావేదికకు పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. ఆ అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ అనంతాచారి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

కదిరిఅర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా మంగళవారం ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు ఈఈ మోసేస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుటాగుళ్ల, చిప్పలమడుగు, సైదాపురం, కోటన్నగారిపల్లి, చలమకుంట్లపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కందుల కొనుగోలు పారంభం

బత్తలపల్లి జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ గోదాములో సోమవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏఓ ఓబిరెడ్డి ప్రారంభించారు. మండలంలో కందులు సాగు చేసిన రైతులు అందుబాటులో ఉన్న రైతు సేవాకేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కందులలో నాణ్యతాప్రమాణాలను పాటించి.. క్వింటా రూ7,550కు కొనుగోలు చేస్తారన్నారు.

నేడు వైద్యశిబిరం

బత్తలపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్యవంతం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. విషజ్వరాలు, కీళ్లనొప్పులు, ఆస్తమా, గుండెజబ్బులు, నరాల బలహీనత, స్త్రీలు, చిన్నపిల్లల సమస్యలు, చర్మవ్యాధులు.. తదితర వాటికి పరీక్షలు నిర్వహించి.. మందులు పంపిణీ చేస్తామన్నారు. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల అనంతరెడ్డి వర్ధంతి సందర్భంగా దీన్ని నిర్వహిస్తున్నామన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ధర్మవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన నల్లగుండ్ల శ్రీరాములు అనారోగ్యంతో వారం క్రితం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న శ్రీపద్మశాలీయ బహుత్తమ సంఘం నాయకులు సోమవారం శ్రీరాములు ఇంటికి వెళ్లి భార్య నల్లగుండ్ల సుజాతను పరామర్శించారు. రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇందులో ఆ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు పుత్తారు ద్రయ్య, జింకా నాగభూషణం, నాయకులు ఉన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరకే భూములిస్తాం

తనకల్లు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నుంచే జాతీయ రహదారిని ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న రోడ్డు విస్తరణకు అవసరమైన పట్టాభూములను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని స్థానికులు, వ్యాపారులు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడారు. తనకల్లుకు బైపాస్ ఏర్పాటు చేస్తే ఇక్కడి చిరు వ్యాపారాలు ఉపాధి కోల్పోతారని వాపోయారు. తహసీల్దార్ మాట్లాడుతూ... విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాననీ, ప్రస్తుతం తనకల్లులోని జాతీయ రహదారినే విస్తరించేలా ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

'వేతనాలు రాకుండా అడ్డుకుంటున్నారు'

అనంతపురం అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తాను కొత్తచెరువు పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నానని, తనకు మూడు నెలల వేతనాలు రాకుండా కొందరు అధికారులు అడ్డుకుంటున్నారని బాధితు రాలు హేమలత బాయి ఆవేదన చెందారు. ఈ మేరకు సోమవా రం పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో జేడీ వెంకట స్వామికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... మూడు నెలలుగా వేతనాలు రాకుండా అడ్డుకుంటున్నారని కన్నీట పర్యంతమైంది. పశుసంవర్ధక శాఖ జేడీకి ఫిర్యాదు చేసి నా పట్టించుకోవడం లేదని, కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరింది.

నీరు, నిధులు ఉన్నా..

తాగునీటికి కటకటే..!



పీఏబీఆర్ కుడి కాలువలో నీరు (ఫైల్)

- ◆ అక్రమ కనెక్షన్ల పేరుతో సత్యసాయి నీటి సరఫరా నిలిపివేత
- ◆ బోరు వేసినా.. నిధులివ్వని అధికారులు
- ◆ ఊరి చుట్టూ పీఏబీఆర్ కుడి కాలువ
- ◆ నిండిన చెక్‌డ్యాంలు
- ◆ అయినా ఏకపాదంపల్లి వాసులకు తప్పని పాట్లు

తాడిమర్రి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏకపాదంపల్లి గ్రామస్థులు ఏడు నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో సుమారు 1500 మంది నివాసముంటున్నారు. గత టీడీపీ హయాంలో 45వేల లీటర్ల కెపాసిటీతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించింది. దానికి సత్యసాయి నీరు సరఫరా అయ్యేలా చేసింది. అయితే ఆ గ్రామంలో కొందరు అక్రమ కనెక్షన్‌లు వేసుకున్నారని సత్య సాయి నీటి సరఫరా అధికారులు ఏకంగా ఆ గ్రామానికి ఏడు నెలల క్రితం నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో గ్రామస్థులు మొత్తం తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాటి నుంచి ఆ గ్రామస్థులు ఆ అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నా.. ఫలితం శూన్యం.

● పట్టించుకోని అధికారులు

ఏకపాదంపల్లి గ్రామం చుట్టూ పీఏబీఆర్ కుడి కాలువ ఉంది. నెల క్రితం వరకు ఆ కాలువలో నీరు పుష్కలంగా పారింది. ఈ కారణంతో ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు బాగా పెరిగాయి. ఏడు నెలల నుంచి సత్యసాయి నీరు సరఫరా కాకపోవడంతో స్థానిక సర్పంచ్ కూచి నాగవేణి పంచాయతీ నిధులతో బోరు వేయించగా పుష్కలంగా నీరు పడింది. దానికి కనెక్షన్‌లు ఇచ్చేందుకు పైపులైన్‌లు, మోటరు ఏర్పాటు చేసేందుకు తగిన నిధులు లేవు. వాటి కోసం మండల అధికారులను పలు మార్లు విజ్ఞప్తి చేసినా వాటి పట్టించుకోలేదు. మండల నిధులు పుష్కలంగా నిధులున్నా వాటిని మంజూరు చేయడం లేదనే ఆరోపణలున్నాయి.



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు





నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్, బోరు

● కూలీల ఇక్కట్లు

అటు మండల అధికారులు, సత్యసాయి తాగు నీటి అధికారులు ఇటు పాలకులు ఏకపాదం పల్లిలో తాగునీటి సమస్యను నిర్లక్ష్యం చేస్తుం డటంతో ఆ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. వెరసి వేసవి ప్రారంభం కాకనే ఈ గ్రామంలో తాగు నీటి కోసం గ్రామస్థులు అల్లాడి పోతున్నారు. పలుమార్లు సమస్యను గ్రామస్థు లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో.. వారు ట్యాంకర్ ద్వారా తాత్కాలికంగా నీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టారు. ఆ ట్యాంకర్ ఏ రోజు వస్తుందో.. ఎప్పుడు వస్తుందో తెలీక.. గ్రామస్థులు వేచిచూడాల్సి దుస్థితి ఏర్పడింది. కాగా, ఈ గ్రామంలోని ప్రజల్లో దాదాపు 90 శాతం మంది వ్యవసాయ కూలీలే. దీంతో వారు పనులు మానుకొని తాగునీటి కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. మరికొందరు వ్యవసాయ పనులు మానుకోలేక సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న పొలాలకు వెళ్లి.. వ్యవసాయ బోర్లు, బావుల వద్ద నుంచి తాగునీటిని తెచ్చుకొంటున్నారు.

కిలోమీటర్ వెళ్తున్నాం



పనులు వదులుకోలేం. రెండు రోజులకొకసారి తాగునీటి కోసం కిలోమీటరు దూరం వెళ్లాల్సివస్తోంది. మరికొందరు ట్యాంకర్‌లో వచ్చే నీటి కోసం పిల్లలను బడిని పంపకుండా.. ఇంటి వద్దే ఉంచుతున్నారు. పిల్లలు చదువులకు దూరం అవుతున్నారు. మా సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు.

- రంగమ్మ, ఏకపాదంపల్లి

అధికారులు స్పందించాలి



గ్రామానికి దూరంగా మా కాలనీ ఉంది. కాలనీవాసులు బోరు బావుల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాలన్నా ఇబ్బందే. నీటి ట్యాంకర్ ఎప్పుడు వస్తుందో తెలీదు. అధికారులు స్పందించి మా సమస్య పరిష్కరించాలి.

- రామసుబ్బమ్మ, ఏకపాదంపల్లి

నిధులు ఇవ్వడం లేదు



గ్రామానికి తాగునీరు అందించేందుకు ఏడు నెలల క్రితమే బోరు వేయించగా నీరు బాగా పడ్డాయి. దానికి మోటర్ ఏర్పాటుకు.. అక్కడి నుంచి పైపులైన్ ఏర్పాటుకు అయ్యే ఖర్చులను మండల గ్రాంటు నుంచి ఇవ్వాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏడు నెలలుగా అదిగో.. ఇదిగో.. అంటారే కానీ పరిష్కారం చూపలేదు. రోజూ గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- కూచి నాగవేణి, సర్పంచ్, ఏకపాదంపల్లి

త్వరలోనే పరిష్కరిస్తాం

ఏకపాదంపల్లి గ్రామంలో నీటి ఎద్దడి నివారించేలా ఇప్పటికే ఎంపీడీఓ చర్య లు తీసుకున్నారు. మండల గ్రాంటు విడుదలపై రెండు, మూడు రోజుల్లో స్పష్టత వస్తుంది. వెంటనే పైపులైన్ ఏర్పాటు చేసి నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం.

- విజయశేఖర్, ఈఓఆర్‌డీ

లోకేశ్ పాదయాత్ర.. చరిత్రలో చెరగని ముద్ర



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర రాష్ట్ర చరిత్రలో... ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేసి రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలిచిందని జిల్లా టీడీపీ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ అన్నారు. యువగళం పాదయాత్ర చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పుట్టపర్తి సత్తెమ్మ ఆలయం వద్ద ఆయన సోమ వారం కేక్ కట్ చేశారు. లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమలో టీడీపీ నాయకులు భీమనేని కిష్టప్ప, బేకరీ నాయుడు, శ్రీనివాసులు, నరసింహులు, గౌస్ పాల్గొన్నారు.

చరిత్రను మార్చిన లోకేశ్ పాదయాత్ర

పుట్టపర్తిటౌన్: టీడీపీ జాతీయ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యు వగళం పాదయాత్ర రాష్ట్ర చరిత్రనే మార్చివేసిందని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆ పాదయాత్ర ప్రారంభించి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారు సోమవారం ప్రకటన విడుదల చేశారు. నాడు లోకేష్ పాదయా త్రకు వైసీపీ అడుగడుగునా ఇబ్బందులు, ఆటంకాలు కలిగించినా.. వెనకడుగు వేయకుండా పాదయాత్ర పూర్తి చేశారన్నారు. రాష్ట్రంలో లోకేష్ పాదయాత్ర చేసిన 90 నియోజకవర్గాల్లోనూ టీడీపీ కూటమి అభ్యర్థులు విజయం సాధించారన్నారు.



అన్నదానం చేస్తున్న ట్రాన్స్‌కో ఏఈ ముక్తేశ్వరి

పేదలకు అన్నదానం

ధర్మవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వెంకటరమణాచార్య 13వ ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా అన్నదానం చేపట్టారు. స్థానిక సిద్దయ్యగుట్టలోని వెంకటరమణాచార్య గురువు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ కొండారెడ్డి, పరమిత పీఠాధిపతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ముక్తేశ్వరీ పాల్గొన్నారు. ఏఈ మాట్లాడుతూ... ట్రస్టు ఆధ్వర్యంలో 12 ఏళ్ల నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ అశోక్‌కుమార్, కార్యదర్శి రామాంజనేయచారి, ఉప కార్యదర్శి మల్లికార్జున, కోశాధికారి నాగభూషణ, కో కన్వీనర్ మణి జ్ఞానశ్రీ, శిష్యబృందం పాల్గొన్నారు.

అలరించిన భక్తిగీతాలు

పుట్టపర్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యార్థులు భక్తిగీతాల ఆలాపనతో భక్తులను అలరింపచేశారు. హైయర్ సెకండరీ, 10, 12 తరగతుల విద్యార్థులు సోమవారం సాయికుల్వంతు మందిరంలో భక్తిగీతాలు ఆలపించారు. గంటపాటు వారి మధుర గానంతో భక్తులు తన్మయం పొందారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



భక్తిగీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

పింఛన్ల తనిఖీ

తాడిమర్రి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.15వేల పింఛన్ పొందుతున్న వారిని ప్రత్యేక అధికారులు డాక్టర్ నరసింహారెడ్డి, చైతన్య సోమవారం పరిశీలించారు. మండలంలోని ఏకపాదంపల్లి, కునుకుంట్ల, పిన్నదరి, తాడిమర్రి, రామాపురం, నిడిగల్లు, నారసంపల్లి గ్రామాల్లో వీరు పర్యటించారు. అగ్రహారం, పెద్దకోట్ల, దాడితోట గ్రామ పంచాయతీల్లో పర్యటించాల్సి ఉంది. మండలవ్యాప్తంగా 61 మంది పింఛన్ పొందుతున్నట్టు ఎంపీడీఓ రంగారావు తెలిపారు. మరో రెండు రోజుల్లో అందరిని పరీక్షించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.



పింఛన్‌దారులను పరిశీలిస్తున్న వైద్యులు

మంచి పుస్తకాలు.. వికాస నేస్తాలు: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మంచి పుస్తకాలు... వ్యక్తిత్వ వికాసాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే గొప్ప నేస్తాలని ఎస్పీ వి.రత్న అభిప్రాయపడ్డారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి బాబు, ఉపాధ్యక్షుడు జయవర్దన్ రెడ్డి, కవి, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్ ఎస్పీని కలిశారు. సామాజిక, సాహిత్య పుస్తకాలను అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ రంగాల సమాచారాన్ని క్రోడీకరించి పుస్తకాలుగా నిలువరించడం అభినందనీయమన్నారు.



ఎస్పీకి పుస్తకాలు అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

డయాలసిస్ కేంద్రం తనిఖీ

ధర్మవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక డయాలసిస్ కేంద్రాన్ని కలెక్టర్ టీఎస్ చేతన్ సోమవారం తనిఖీ చేశారు. అక్కడ వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలు, మందులు గురించి మెడికల్ సూపరింటెండెంట్ మాధవితో ఆరా తీశారు. ఇప్పటిదాకా 21 మంది రోగులు డయాలసిస్ కోసం నమోదు చేసుకున్నారని, వారిలో ప్రస్తుతం 16 మందికి డయాలసిస్ రెండు విడతలుగా నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. గతంలో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే రూ.3 వేల దాకా ఖర్చు అయ్యేదని, ప్రస్తుతం ఆ సేవలు ఈ కేంద్రంలో ఉచితంగా లభిస్తున్నాయని రోగులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో డయాలసిస్ మెడికల్ ఆఫీసర్ అభిలాష్, సిబ్బంది పాల్గొన్నారు.

● ఈవీఎంల పరిశీలన

సాధారణ అసెంబ్లీ ఎన్నికల అనంతరం స్థానిక మార్కెట్ యార్డులో భద్రపరచిన ఈవీఎంలు, వీవీప్యాట్లను కలెక్టర్ టీఎస్ చేతన్ సోమవారం పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ నటరాజ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.



డయాలసిస్ కేంద్రంలో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్

క్రైం న్యూస్..

పంట కాలువలో పసికందు



పసికందు మృతదేహం

బుక్కపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అమ్మ ఒడిలో ఉండాల్సిన పసికందు.. శవమై పంట కాలువలో కొట్టుకొచ్చింది. స్థానిక రామస్వామి ఆలయం వద్ద పంట కాలువలో సోమవారం పసికందు మృతదేహం లభించడం సంచలనమైంది. నెలలు నిండని మృతదేహం కాలువలో కొట్టుకొస్తుండగా స్థానికులు బయటకు తీసి, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్యాబాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు పసికందు మృతదేహాన్ని పరిశీలించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి, పసికందు దేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. పసికందుకు అవయవాలు కూడా పూర్తిగా ఏర్పడకపోవడంతో మృత శిశువు ఆడ, మగ అన్నది తెలియని పరిస్థితి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



బస్సును ఢీకొని తీవ్రంగా గాయపడిన మస్తాన్

కొత్తచెరువు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తచెరువుకు చెందిన మస్తాన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతను బైక్‌పై బుక్క పట్నం వెళ్తూ.. ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మస్తాన్ తలకు తీవ్రగాయాలు కాగా కుడి కాలు విరిగింది. వెంటనే అతన్ని ఆర్టీసీ డ్రైవర్, ప్రయాణీకులు ఆటోలో కొత్త చెరువు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇద్దరికి గాయాలు

బత్తలపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగారెడ్డిపల్లి క్రాస్ సమీపంలో సోమవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. బత్తలపల్లికి చెందిన బాబ్జీ అనంతపురం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. ధర్మవరం రూరల్ మండలం రావులచెరువు చెందిన సూర్యనారాయణ బత్తలపల్లెకు బైక్‌పై బయలుదేరాడు. లింగారెడ్డిపల్లి క్రాస్ సమీపంలో ముందు వెళ్తున్న బాబ్జీ బైక్‌ను సూర్యనారాయణ ఢీకొన్నాడు. ప్రమాదంలో వీరిద్దరూ గాయపడ్డారు. వీరిని 108లో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉలవ కట్టెకు నిప్పు



దగ్ధమైన ఉలవ కట్టె

నల్లమాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లశింగయ్యగారిపల్లి సమీపంలో నల్లమాడ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మయ్య మామిడి తోటలో నిల్వ ఉంచిన ఉలవ కట్టెకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నిప్పు పెట్టారు. దీంతో అది పూర్తిగా కలిబూడిదైంది. పదేళ్ల వయసుగల ఆరు మామిడిచెట్లకు, పైపులైన్, డ్రిప్ పైపులు, పరికరాలకూ నిప్పు పెట్టారు. దీంతో తనకు రూ.40 వేల నష్టం వాటిల్లినట్లు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు.

న్యూస్ బాక్స్

అడవికి నిప్పు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెనుకొండ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని ఆర్టీఓ చెక్‌పోస్టు వద్ద 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న కొండలకు గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం మధ్యాహ్నం నిప్పుపెట్టారు. విషయం తెలుసుకున్న హ్యూమన్‌రైట్స్ కల్చర్ నేచర్ డెవలప్‌మెంట్ సభ్యులు హరిలాల్‌నాయక్, రంజిత్‌నాయక్, మరికొందరు ఘటనా స్థలానికి చేరుకుని నిప్పును ఆర్పడానికి ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

వాగులో పడి పశువుల కాపరి మృతి

గోరంట్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపల్లి వద్ద వాగులో పడి పశువుల కాపరి వడ్డె గంగాధర్ (54) మృతి చెందాడని ఎస్ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. రంగప్ప కుమారుడు గంగాధర్ పశువులను మేపడానికి ఆదివారం పొలాల్లోకి వెళ్లాడని, సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా వాగు నీటిలో పడి మృతి చెందినట్లు వివరించారు. ప్రమాదవశాత్తు కాలు జారి పడి మృతి చెంది ఉంటాడని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

గోరంట్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీ చెందిన రమణ కుటుంబ కలహాలతో విషద్రావకం తాగి సోమవారం ఆత్మహత్యకు యత్నించారు. రమణ రజక వృత్తితో పాటు తాపీమేస్త్రీగా పనిచేస్తూ భార్యపిల్లలతో జీవనం సాగిస్తున్నారు. కొన్నిరోజుల క్రితం దంపతుల మధ్య ఘర్షణ జరగడంతో ఆమె బంధువుల ఇంటికి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ వినోద్‌కుమార్ ప్రథమ చికిత్సలు చేశారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

చిత్రాలతో సులభంగా అవగాహన

హిందూపురం అర్బన్, జనవరి, 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చిత్రాల నమూనాలతో బోధిస్తే సులభంగా అర్థం చేసుకుంటారని ఎంఈఓ గంగప్ప పేర్కొన్నారు. స్థానిక పాంచజన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన నక్షత్ర కూటమికి సంబంధించిన చిత్రాలను ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. సాధారణంగా విద్యార్థులకు పుస్తకాలు చూపించి, లేదా బోర్డుపై గీతలు గీసి చూపించి బోధిచడం కంటే నమూనాలతో గుర్తుండిపోతుందన్నారు. భూమి ఆవిర్భావం, నక్షత్రాలు, వాటి పుట్టుక, గ్రహాల కదలిక, సూర్యచంద్రుల ప్రభావం, గ్రహణాలు, ప్రభావం, ఇస్రో, విశ్వంలో జరిగే అద్భుతాలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు, కరెస్పాండెంట్ నందకుమార్, హెచ్‌ఎం గాయత్రి, ఏఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శివుడికి రుద్రాభిషేకం



రుద్రాభిషేకం నిర్వహించిన దృశ్యం

మడకశిరటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిరిడీ సాయినాథుడి ఆలయంలో వెలసిన దత్త బాణ లింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. నందీశ్వరుడికి పూజలు నిర్వహించారు. అదేవిధంగా చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ధనుర్మాసం చివరి సోమవారం కావడంతో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గృహ నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఇంటి పట్టా ఉన్నవారు ఈ నెలాఖరు వరకు గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని హౌసింగ్ ఏఈ శ్రీనాథ్ తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద పెనుకొండ పట్టణానికి 90 ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. ఇప్పటి వరకు 65 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇంకా ఇంటి నిర్మాణం కోసం ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కోకన్వీనర్‌గా గోపీచంద్‌నరసింహ



గోరంట్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏబీవీపీ రాష్ట్ర విభాగం కోకన్వీనర్‌గా గోరంట్ల మండలం కమ్మలవాండ్లపల్లి వద్ద ఉన్న బెస్ట్ యూనివర్సిటీ విద్యార్థి గోపిచంద్‌నరసింహ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో రాష్ట్ర మహాసభల్లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న గోపీచంద్‌నరసింహను రాష్ట్ర కోకన్వనర్‌గా నియమించారు. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

చిరు వ్యాపారులకు రుణాలివ్వాలి

మడకశిరటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీతో రుణాలు అందించి ఆదుకోవాలని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మడకశిర పట్టణంలో చిరు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హోటళ్లు, చిన్న దుకాణాలు నిర్వహించే చిరువ్యాపారులకు ప్రభుత్వం తక్కువ వడ్డీతో రుణాలు అందించి ఆదుకోవాలన్నారు. ఈసందర్భంగా సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి పవిత్ర, యూనియన్ నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

● లోఓల్టేజీతో కాలిపోతున్న మోటార్లు, స్టార్టర్లు ● దెబ్బతింటున్న పంటలు ● ఆందోళనలో రైతులు



11 కేవీ వైరు తెగి నేలపై పడి ఉన్న దృశ్యం, విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద రైతుల పడిగాపులు

అమరాపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని కెంకెర, కాచికుంట గ్రామాల్లో దాదాపు రెండు నెలల నుంచి లోఓల్టేజీ సమస్యతో మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 రోజుల క్రితం విద్యుత్ శాఖ అధికారి సిద్దేశ్వరను సంప్రదించగా రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారని, ఇంతవరకు ఏమాత్రం స్పందించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ వైర్లు ఎక్కడ పడితే అక్కడ తెగి కిందకు పడుతున్నాయని, ఎన్నిసార్లు ఫోన్‌చేసినా కనీసం స్పందించలేదన్నారు. స్థానిక సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ను సంప్రదించగా అతను సరైన సమాధానం చెప్పలేదన్నారు. దీంతో హిందూపురం డీఈని సంప్రదించగా ఆయన త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. స్థానిక అధికారులు ఎలాంటి సమాధానం ఇవ్వడం లేదని, లోఓల్టేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని రైతులు, చెరువు సంఘం అధ్యక్షుడు హనుమంతరాయ, ఉపాధ్యక్షుడు శేఖర్, శ్రీనివాస్, రంగనాథ, బసవరాజు, బంగారు హనుమంతరాయప్ప, నారాయణ, గోపాల్, గిరీష్, మంజునాథ్, నింగేగౌడ్, తదితరులు తెలిపారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయండి

● రెవెన్యూశాఖ మంత్రికి ఎంపీ, ఎమ్మెల్యే వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

మడకశిరటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మడకశిరలో సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి రెవిన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎంపీ బీకే పార్థసారధి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో వారు రెవిన్యూ మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. మడకశిర నియోజకవర్గంలో అమరాపురం, అగళి తదితర మండలాల నుంచి పెనుకొండ ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లాలంటే వంద కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం సంవత్సరాల తరబడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. ఉన్నతాధికారులతో చర్చించి మడకశిరలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మైక్రో ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మహిళల సఫలీకరణ పేరుతో ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ, గ్రామీణకూట, స్పందన లాంటి మైక్రో ఫైనాన్స్ కంపెనీలు మహిళలకు రుణాలు ఇచ్చి అధిక వడ్డీలతో దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. సంఘం పేరుతో అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని రుణాలు కల్పించి కట్టకపోతే దౌర్జన్యంగా ఇళ్లకు వెళ్లి చిత్రహింసలకు గురిచేస్తున్నారని రైతు సంఘం నాయకుడు పూజారప్ప ఆరోపించారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వీరిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఫైనాన్స్ కంపెనీల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతుండటంవల్ల కొన్ని కుటుంబాలు గ్రామాలు వదిలి వేరేచోట కాపురాలు పెడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అనేక మంది రైతు సంఘం నాయకులు కలిసి తహసీల్దార్ వరదరాజుకు వినతి పత్రం అందించారు.

సచివాలయ సిబ్బందికి నోటీసులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గోరంట్ల, జనవరి27 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలు నిర్వహించని గ్రామ సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ నరేంద్రకుమార్ సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆదివారం ఊరంతా త్రివర్ణపతాకాలు ఎగురవేస్తుంటే, గోరంట్లలోని ఎమ్మార్సీ వద్ద గల సచివాలయం-5, మార్కెట్‌లోని సచివాలయం -4, గ్రామ చావిడిలోని సచివాలయం -2 కార్యాలయ సిబ్బంది జెండా ఎగురవేయలేదు. కార్యాలయాల తాళం కూడా తీయకపోవడంతో సర్వత్ర విమర్శలు వ్యక్తమైన విషయం తెలిసిందే. ఈవిషయాన్ని 'గ్రామ సచివాలయాలపై ఎగరని మువ్వన్నెల జెండా' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీఓ స్పందించి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సచివాలయ సిబ్బంది గణతంత్ర వేడుకలు నిర్వహించకపోవడంతో గోరంట్ల మేజర్ పంచాయతీ గ్రేడ్ -1 కార్యదర్శి సుబ్రహ్మణ్యంతోపాటు, 2, 4, 5 సచివాలయల కార్యదర్శులు, సంబంధిత సచివాలయాల సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. దీనిపై వెంటనే సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లల మృతి



మృతి చెందిన గొర్రెపిల్లలు

మడకశిర రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకవాండ్లపల్లిలో సోమవారం సాయంత్రం రొప్పంలో ఉన్న గొర్రెపిల్లలుపై కుక్కలు దాడి చేశాయి. దీంతో 15 గొర్రె పిల్లలు మృతిచెందాయి. గొర్రెల కాపరి తిమ్మప్ప గొర్రెలను పొలాలు నుంచి ఇంటికి తీసుకువస్తుండగా రొప్పంలో ఉన్న గొర్రె పిల్లలను కుక్కలు చంపాయ ని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు రూ.60 వేలు నష్టం వాటిలినట్లు తెలిపాడు.

కాలనీలను శుభ్రంగా ఉంచాలి

పెనుకొండ టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని కాలనీలను పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. శనివారం బీటీఆర్ కాలనీ, బసవతారక కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలువలు లేకపోవడంతో మురుగు కుంటగా మారి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. తక్షణం పనులు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, ఇంజనీర్ పవన్ దృష్టికి సమస్య ఆయన తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

బంజారాల సమస్యలను పరిష్కరించండి

సోమందేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత బంజారా సంఘం నాయకులు సోమవారం ఢిల్లీలో జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ అంతర్‌సింగ్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు అంజేనాయక్ మాట్లాడుతూ.. బంజారాల కులదైవమైన సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించాలని కోరామన్నారు. ఆరోజు సెలవు ప్రకటించాలని కోరారు. ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్స్, గిరిజన తండాల్లో మౌళిక వసతులు కల్పించాలని అభ్యర్థించినట్లు తెలిపారు. స్పందించిన ఆయన రాష్ట్రంలో త్వరలో పర్యటిస్తానని హామీ ఇచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డుంగావత్ రమేష్‌నాయక్, సీతారాంనాయక్ పాల్గొన్నారు.

కఠోర శ్రమకు గుర్తింపే పద్మభూషణ్



సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

చిలమత్తూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కళా రంగంలో కఠోర శ్రమ పడితేనే హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటించిందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బాలకృష్ణ పద్మభూషణ్ వచ్చిన నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. కళా రంగంలో తండ్రికి తగ్గ తనయుడుగా కఠోరంగా శ్రమించడంతోనే బాలకృష్ణకు ఈ గుర్తింపు వచ్చిందన్నారు. ఆయన సినీ రంగంలోనే కాకుండా ప్రజా సేవలో శ్రమిస్తున్నారని, అందుకే ప్రజాక్షేత్రంలో సైతం హిందూపురం నియోజకవర్గంలో వరుసగా ఎమ్మెల్యేగా గెలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, శ్రీదేవి, అశ్వర్థప్ప, నందీశప్ప, అంజినప్ప, బాలాజీ పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

లేపాక్షి, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : వాహనదారులు నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరేంద్ర పేర్కొన్నారు. సోమవారం జాతీయరహదారిపై ఉన్న టోల్‌ప్లాజావద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాలు నడపాలన్నారు. బండికి సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రికార్డులులేని వాహనదారులకు అపరాదరుసుం విధించారు.

రహదారి భద్రతపై ర్యాలీ

సోమందేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో విద్యార్థులచే పోలీసులు ర్యాలీ నిర్వహించారు. క్రీస్తుజ్యోతి విద్యార్థులు భగీరథ సర్కిల్ వరకు ప్లకార్డులు, బ్యానర్లు చేతబట్టి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మానవహారం ఏర్పాటుచేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ.. వేగంకంటే ప్రాణం చాలా విలువైనది అన్నారు. వాహనదారులు వేగాన్ని నియంత్రించి నడపాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో మహిళ మృతి


● మరో ఇద్దరికి తీవ్రగాయాలు



మృతి చెందిన అంజినమ్మ

మడకశిర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడిన సంఘటన మడకశిర పట్టణ సమీపంలోని మల్లినాయకనపల్లి వద్ద చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. మడకశిర మండలం చందకచర్ల గ్రామానికి చెందిన మల్లికార్జున అతడి భార్య అంజినమ్మ ఇద్దరూ మడకశిర పట్టణానికి ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. అదే సమయంలో మడకశిర నుంచి రొద్దం మండలం రెడ్డిపల్లికి చెందిన అనిల్ గ్రామానికి వెళుతుండగా మల్లినాయకనపల్లి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ప్రమాదంలో అంజినమ్మ(45) అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త మల్లికార్జునకు తీవ్ర గాయాలయ్యాయి. అతడికి మడకశిర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనిల్‌కు కూడా తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. ఏఎస్ఐ ముత్యాలు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ



చంద్రబాబును కలిసిన ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సోమవారం సాయంత్రం సచివాలయంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కలిశారు. మడకశిర నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల పర్యటించిన సందర్భంగా ఇచ్చిన హామీలు, అభివృద్ధి పనులపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మడకశిర నియోజకవర్గంలో పరిశ్రమలతోపాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించినట్లు వారు తెలిపారు.

సోలార్ పార్కులో బ్లాస్టింగ్ : ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

పావగడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా పావగడ తాలూకా తిరుమణి ప్రాంతంలో జేఎస్‌డబ్ల్యూ అనే కంపెనీ సోలార్ పార్కు కోసం బండను పేలుస్తుండగా ఓ వ్యక్తి చనిపోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో బండను పేల్చే క్రమంలో రాయచూరు ప్రాంతానికి చెందిన బసవరాజప్ప (45) మృతి చెందగా.. పావగడ తాలూకా అచ్చంపల్లికి చెందిన శివయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కేఎస్‌పీటీసీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ మహేష్, తిరుమణి రూరల్ సీఐ గిరీష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. 1002 ఎకరాల్లో నిర్మాణం చేపడుతున్న సోలార్ పార్కులో ఎలాంటి ముందు జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని స్థానికులు ఆరోపించారు. ఈ బ్లాస్టింగ్ వల్ల చుట్టుపక్కల కొండలు, గుట్టలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ మేరకు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అగ్నికి ఆహుతైన చింతచెట్లు, కందిపంట



కాలిపోయిన చింతచెట్లు, పైపులను చూపుతున్న రైతు

పావగడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని దవడబెట్ట గ్రామానికి చెందిన రైతులు నాగరాజు, భైరప్పకు చెందిన తోటలో కందిపంట, మల్బరీ పంటలకు గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో తమ గ్రామానికి చెందిన వ్యక్తులే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు రైతులు తెలిపారు. పట్టు, డ్రిప్ ఇరిగేషన్, బోర్‌వెల్ పైపులు, కందిపంట, చింత, టెంకాయచెట్లు పూర్తిగా కాలిపోయినట్లు వివరించారు. నిందితులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

పాఠశాలకు సామగ్రి వితరణ



ఫర్నీచర్ అందజేసిన పూర్వ విద్యార్థులు

పెనుకొండ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టూరు జడ్పీ హైస్కూలుకు పూర్వ విద్యార్థులు ఫర్నీచర్ వితరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగార్జునుడు తెలిపారు. 1983-84 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు, గ్రంథాలయానికి అవసరమయ్యే నాలుగు ర్యాక్‌లు, 20 కుర్చీలు అందించినట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పూర్వ విద్యార్థులను అభినందించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి : సీఐ



రికార్డులను పరిశీలిస్తున్న సీఐ రాజ్‌కుమార్

అగళి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సీఐ రాజకుమార్ పేర్కొన్నారు. అగళి పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో జరిగిన కేసు వివరాలపై ఆరాతీశారు. మండలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, వాటిపై ప్రత్యేకంగా అవగాహన క్యాంపులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇసుక అక్రమ రవాణా, పేకాట, మట్కా, గుట్కా, కర్ణాటక మద్యం తదితర వాటిపై దృష్టిసారించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మండలంలో అనుమనపల్లి, నరసాంబుది గ్రామాలలో గ్రామదేవత జాతరలు జరుగుతున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్ఐ వీరేష్‌కు సూచించారు. గ్రామాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.20వేల విరాళం

అగళి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలం బొమ్మరసనపల్లికి చెందిన యువకుడు మంజునాథ్ అనుమనపల్లి గ్రామంలో రంగనాథస్వామి దేవాలయ నిర్మాణం కోసం రూ.20వేలు విరాళం అందజేసినట్లు ఎంపీపీ చంద్రప్ప తెలిపారు. ఆలయ గోపురం నిర్మాణం కోసం విరాళం అందజేసినట్లు వివరించారు.

వాహనాల తనిఖీ

గుడిబండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరుబాగల్ క్రాస్‌లో ఎస్ఐ రాజకుళ్లాయప్ప ఆధ్వర్యంలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలన్నారు. వాహనాలకు రికార్డులు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కల్గి ఉండాలని వాహనదారులకు సూచించారు. హెల్మెట్‌లు లేకుండా వాహనాలు నడిపితే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అనంతరం రికార్డులు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు.

రేపు మండల సమావేశం

అమరాపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే, జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలన్నారు. మండలంలోని మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.